అమ్మో! నాన్న...!!?

చింతపల్లి వెంకటరావు

"హాలు కుర్చీలో చేరబడి పేపరు చదువుతున్న గుర్నాథం నెత్తిమీద పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. పెరట్లోనుంచి కేకలు వినపడేసరికి.

ఒకటే కక్కుకోవడం నిర్విరామంగా కక్కుకుంటున్న భార్యవద్దకు పోబుద్ధికాక కదలక మెదలక అలా కుర్చీకే అంటుకు పోయాడు.

అసలు గుర్నాథానికి ఆ కులంటేనే మహాభయం

మొదట్లో...కాపురానికి వచ్చిన కొద్ది నెలలకే రోజూ మాదిరిగా భర్తన తెల్లారిన ఓ శుభదినాన భళ్లున కక్కుకుంటున్న శ్రీమతిని చూసి తెల్లబోయాడు. కొంతసేపు తెప్పరిల్లాక భార్య చెవిలో గుసగుసలాడితే, తండ్రి కాబోతున్నందుకు ఎగిరి చంకలు గుద్దాడు. ఆ కక్కుకున్న పథ సంవత్సరంలో వేవిళ్ళంటూ పిండివంటలు, పళ్ళు ఫలహారాలు అభీష్టాన్ని తెలిపి నానాగడ్డి తిని. తిని తినీ మొగుడనే వాడిని కూడా తినేసే భార్య మంగమ్మ ధోరణికి భయభ్రాంతుడయ్యేడు సదరు మొగుడు గుర్నాథం.

మరో ఏడాదిన్నర పోయాక మంగమ్మ మళ్ళీ వాంతులేసుకుంది ఈసారి తెల్లబోలేదు మరో పాపకో, బాబుకో మళ్ళీ తను బాబు కాబోతున్నాడని గ్రహించి చంకలు గుద్దాడు. అంతే గాని మొదట్లో ఎగిరినట్టు చంకలు గుద్ది సంబరపడ్డ గుర్నాథం రాన్రాను వయసు తరిగి, సత్తువ కరిగి, ఆరుగురి పిల్లలతో, పెళ్ళిడుకెదిగిన ఆడపిల్లతో, పది వేల రూపాయల అప్పు (అక్షరాల పదివేల రూపాయలు మాత్రమే) తో మిగిలిపోయాడు

-మళ్ళీ ఇప్పుడు ఈ వయసులో...

భార్యపై మండి పడ్డాడు.

పళ్ళు పటపట కొరికాడు....ఉరిమాడు.

పెరట్లోకి ఉరికాడు.

నోటినిండా నీరు పోసుకుని పుక్కిలిస్తున్న కూతుర్ని పట్టుకు నిలబడ్డ మంగమ్మ పెరట్లోకి వస్తున్న భర్త వంక చూసి "ఏమండీ! అమ్మాయికి...."

ఇందాక నెత్తిమీద పిడుగు పడ్డట్టయితే, ఇప్పుడు ఒకటి .. రెండు... మూడు పదుల్లో .. వేలల్లో పిడుగులు కురిసి, గుభేలుమన్న గుండె సమ్మె చేసి నట్టయి బొమ్మలా నిలబడి పోయాడు- పాపం గుర్నాథం.

"ఏమండీ!" అని దగ్గర కొచ్చిన మంగమ్మ భుజం పట్టుకు కుదిపితే ముసలి పులిలా గర్జించాడు. దాంతో ఏదో సన్ని

వేశం చూస్తున్న ప్రేక్షకుల్లా నిలబడి పోయారు.

"నా కొంప ముంచిందే. పరువు గంగలో కలిపిందే" అంటూ అరుస్తున్నట్టుగా చిందులు తొక్కుతున్నాడు. తండ్రి చిందు లెందుకో? ఏమిటో అర్థంకాక, అయోమయంగా ఎనిమిదేళ్ళ చిట్టిగాడు తన చిట్టి చిట్టి కళ్ళల్లో పెద్ద, పెద్ద క్వశ్చెన్ మార్కుల గుర్తు తీసుకొని మరీ చూస్తున్నాడు.

ఒక్కుదుటలో పోయి భార్య అడ్డు పడుతున్నా కూతురి చెంపలు కంది పోయేలా వాయించేశాడు.

"పాపిష్టి దానా! ఎంతకు బరితెగించావే! రేపు నలుగురిలో నేనెలా తలెత్తుకు తిరిగేది....పెళ్ళి కాకుండానే తల్లిపికాబో తున్నావంటే విన్న వాళ్ళు నవ్విపోతారు, మన మొహాల మీద ఉమ్మి ఉమ్మేస్తారే .. ఉమ్మేస్తారు" అంటూ నాలుగు దులిపేసి, "నిన్ను....నిన్ను నిన్నిలా కాదే!" రెచ్చిపోతూ ఇంట్లోకి దారి తీసే సరికి కుటుంబం యావత్తుకు తుఫాను వస్తున్న సూచనలు కనబడ్డాయి

గదంతా వెతికేస్తున్నాడు కూతుర్ని హతమార్చే ఆయుధం కోసం. "వెధవది గన్నయిన లేదు కాల్చేద్దా మంటే" అను కున్నాడు. టేబిల్ పైనున్న పళ్ళు కోసుకునే చాకుపై దృష్టిపడి, కూతుర్ని చంపే యాలన్న గుర్రుతో గర్నాధం సర్రున చాకు చేతిలోకి తీసుకొనే సరికి సర్రున వేలుతెగి బొట బొట నెత్తురు బొట్లు కారే సరికి "అమ్మో" అంటూ గట్టిగా అరచి వేలుని నోట్లో పెట్టుకొని చప్పరించ సాగాడు బాధగా.

భర్త ఏదో ఇబ్బందిలో పడ్డాడని, కుటుంబ సిబ్బందిని వెంట బెట్టుకొని లోపలికొచ్చిన మంగమ్మ ఆతృతగా "ఏం వయ్యిందండీ! ఏంవయ్యింది" అ నే సరికి వేలును నోట్లోంచి తీసేసి ఆ చెయ్యిని వెనక్కి దాచేసుకుంటూ "నాకేం కాలేదుగాని . " అంటూ గంభీరంగా పలికి మళ్ళీ వెతకసాగాడు. కూతుర్ని హతమార్చే ఆయుధం కోసం గదంతా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఓవ రకు సరాసరి వంటగదిలోనికి పోయాడు.

వంట గదిలోనుండి చేతిలో కత్తి పీటతో దర్శనమిచ్చి, ఒకొక్క అడుగు వేస్తూ కూతురివైపు పోతున్నాడు.

తన వైపే వస్తున్న తండ్రిని చూసి భయంతో నిలువెల్లా వణికి పోయింది తాయారు. దగ్గర కొచ్చేస్తున్నాడు .. కానిప్పుడు తల్లి ముఖకవళికల్లో మార్పు లేక పోయేసరికి ఆందోళన పడుతూ ఏడుపు అందుకుంది. చిట్టిగాడు మినహాయించి పిల్లలందరూ ఏడుస్తూ, ఉమ్మడిగా ఒకేసారి తండ్రి కాళ్ళపైపడి, కాళ్ళకు సంకెళ్ళలా చేతులు పోనిచ్చి కదలకుండా గట్టిగా పట్టుకున్నారు.

"వదలండి!. దాన్నిరోజు చంపేసి నాకు పుట్టలేదను కుంటాను ఆ పాపిష్టి దాన్ని . " అంటూ పెనుగులాడుతుంటే "వదలండర్రా! ఏంచేస్తారో? ఎలా చంపే

హాస్యకథల పోటీలో

ఎన్నికైన కథ

సారో… చూద్దాం. వంకాయ కూడా తెగని ఆ కత్తిపీటతో దాని మెదకాయ ఎలా కోస్తారో చూద్దాం" అనేసరికి పిల్లలందరూ తండ్రి కాళ్ళను వదిలేశారు.

భార్యవంక రుసరుస చూస్తూ; కత్తి పీట వంక ఓసారి చూసి కత్తి పీట పదున్ను వేలితో పరీక్షించసాగాడు.

"ఇంతకీ ఏంవయ్యిందనీ అలా ఎగిరి పోతున్నారు?"

"నీకు ఏంవీకానట్టే ఉందే! రేపది బిడ్డను కంటే లోకం దుమ్మెత్తి పోస్తుంది! ఇంత జరిగినా ఏం కానట్టు ఎలా ఉన్నావే? నా కొంప ముంచిందే…. పరువు గంగలో కలిపిందే" అక్ష రక్షరాన్ని సాగదీస్తూ శోకాలు పెట్టసాగాడు.

"ఇంతకీ చెప్పింది వినండి! అదేదో పాడు పన్చేసి, కడుపొచ్చి కక్కుకుంటుందను కుంటున్నారా? రాత్రి తిన్నద రక్క అది కక్కుకు చస్తుందే…. మధ్యలో చంపేస్తా….చంపేస్తా సంటూ మీ అరుపులు, మీరునూ! మీ కంగారు ముండా!"

"అయితే ఇంతకీ చెప్పి చావ్వేమే!"

"నన్ను చెప్పనిస్తున్నారటండీ! కంగారుతో చంపేస్తుంటే ఇంకేంవి చెప్పేది"- ఆ మాటతో మళ్ళీ మనిషైన గుర్నాధం ముఖం చిన్నది చేసుకొని కూతురి వద్ద కొచ్చి "ఇది నా కూతురే?! .. అలాంటి పాడు పన్చెయ్యదే!" భార్యతో గర్వంగా అన్నాడు.

అప్పటికి తుఫాను వెలిసింది. . గుర్నాధం మనసు శాంతపడి, ఇంట్లో ప్రశాంతత ఏర్పడింది.

గుర్నాధం మహా కంగారు మనిషి, తాడును చూసి పామనుకొని భయపడే గుర్నాధంలో ఆ కంగారన్నది చిన్ననాడే మొలకెత్తి, వృక్షమై నేడు నరనరాల్లో వేళ్ళతో పాతుకుపోయింది. ఆ కంగారు వల్లనే తరచు ఆఫీసరుచే దీవనలు పొందుతుంటాడు. ఆఫీసులో ఆయన నామధేయం కె. జి. నాధం (కంగారు గురునాథం). చూడ్డానికి పొట్టిగా, లావుగా, పొడుచ్చు కొచ్చిన పొట్టతో టిప్ టాప్‌గా నిత్యం ఓకప్‌లో ఉంటూ, వయసు మీద పడినా వయసుతో ఉన్నట్టుండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటుంటాడు, చాలా జాగ్రత్తయిన మనిషి కూడా. పిల్లలను ఒకకంట కనిపెడుతూ మరీ జాగ్రత్త వహిస్తుంటాడు. అలా ఓకంట కనిపెడుతున్న ఓరోజున ఎదురింటి అబ్బాయి డాబాపైనుంచొని, కనుసైగలు చేయటం, ఇట్నుంచి అమ్మాయి మునిముని నవ్వులు విసరడం కంటపడింది. కాని అడిగేందుకు అవకాశం చిక్కక ఊరుకున్నాడు.

○ ○ ○

"ఏంవండీ! అమ్మాయి మనకిక లేదండీ! చూడండీ!..ఎంత అఘాయిత్యం చేసిందో?" బొబ్బలు పెడూ వర్షిస్తున్న కళ్ళతో అందించింది చేటలో కాగితాన్ని.

వణుకుతున్న చేతుల్తో అందుకొని గుర్నాధం ఆందోళనతో విప్పి చదవసాగాడు.

"నాన్నా!"

అమ్మ నా మీద ప్రేమ కొద్దీ విషయాన్ని మరుగపరిచి తిన్నది అరక్క కక్కుకున్నానని చెప్పింది నీకు భయపడి. కాని అసలు విషయం—మన ఎదురింటి మోహన్‌తో తొందరపడి

మీ రన్నట్టుగా మీ కొంప ముంచి పరువు గంగలో కలిపాను. అందుకే నేనే ఏదైనా గంగలో పడి ఆత్మహత్య చేసుకుందామనే మన బావిలో దూకి మీకు దూరమవుతున్నా! మన బావిలో దూకి బావినీళ్ళను కూడ అపవిత్రం చేసినందుకు నన్ను క్షమించండి. పైవాళ్ళ బావిలో పడి పోదామంటే ఈ విషయం బయటకి పొక్కి పోతుందని భయపడి మన బావి లోకే దూకేశాను మీకు పోతూ పోతూ నీళ్ళకు కూడా ఇబ్బంది కలిగించా! మరేమీ అనుకోకుండా మన పక్కంటి కామాక్షమ్మ గారింటికి పోయి బావి నీళ్లు తెచ్చుకోమని అమ్మకు మరీ మరీ చెప్పండి.

మీకు ఈత వచ్చునో, రాదో నాకు తెలియదు. మీరే ఏదో ప్రయాసపడి నా శవాన్ని వెలికి తీసి గట్టు చప్పుడు కాకుండా ఎక్కడో పాతెయ్యడమో, పారేయడమో చేయండి. నన్ను క్షమించి మన్నించండి.

మీ జేష్ట పుత్రిక,
—తాయారు.

"అమ్మా! తాయారూ!" అంటూ గట్టిగా ఇంటి పెంకులు ఎగిరిపోయేలా ఒకే ఒక్క కేక పెట్టాడు. ఆ కేకకు నిద్ర పోతున్న మంగమ్మ ఉలిరిపడి, మేల్కొని, "అమ్మా! తాయారూ . తాయా రెంత పన్చేశావమ్మా తాయారూ ....తాయా రెంత పన్చేశావమ్మా" మంచంపై విలపిస్తున్న భర్తను చూసి, కుదిపి మరీ అడిగింది. "ఏంవిటండీ! మీ కలవరింతలు మీరూనూ! ఏదైనా పాడు కలొచ్చిందా"

కొంత సేపటికి తేరుకొని, క్షణం సేపు గదంతా పరికించగా ఆ మూలకు మంచంపై హాయిగా నిద్ర పోతున్న కూతురు తాయారు వంక చూసి గుండె నిబ్బరం చేసుకొని "అబ్బే! ఏం లేదు.. వెళ్లి నిద్రపో" భార్యను గద్దించాడు గర్జించాడు.

ఏ ఒక్క విషయాన్నయినా దృష్టిలో పెట్టుకున్నా, దృష్టి పడ్డా కలల రూపంలో వచ్చి దాని ప్రభావం మనిషి పై బాగా దెబ్బ తీస్తుంది. ఆ మాదిరిగానే దెబ్బ తిన్న గుర్నాధం మళ్ళీ నిదుర పోయేందుకు కళ్లు మూసు కుంటున్నాడు విశ్వ ప్రయత్నం చేస్తూ.

అర్థరాత్రి .. కీచుమంటూ శబ్దం.

అడుగుల చప్పుడు .. రాలిన ఎండు టాకులపై అడుగులు పడి ఫెళ ఫెళ మని విరుగుతున్న చప్పుడు.

ఇప్పుడా చప్పుడు గుర్నాధం స్పష్టంగా వింటున్నాడు.

భయంతో లేచాడు.

క్షణంక్రితం మంచంపై నిద్రపోతున్న కూతురు మంచంపై లేక, ఖాళీగావున్న మంచంకేసి చూసి మరింత ఆందోళన పడి, తడబడుతూ, అడుగు లేద్దామన్నా అడుగు పడనట్టు వణుకుతున్న కాళ్ళతో తలుపు తెరచుకొని పెరట్లోకి వెళ్లేసరికి తాయారు నెమ్మదిగా, చప్పుడు కాకుండా బావివైపు వెళ్లడం గుర్నాధం కంట పడింది.

గుర్నాధం బెంబేలెత్తి పోయాడు.

క్షణం క్రితం వచ్చిన కల నిజం కాబోతుంది. ఇక ఆగితే లాభంలేదు.... బావిలో దూకేస్తుంది....దూకేస్తుంది— →

నిర్ధారించుకున్నాడు. ఒక్కుదుటలో పోయి కూతురు భుజం పట్టుకుని వెనక్కి లాగ "ఒసే! మంగమ్మా" గట్టిగా అరిచాడు. ఆ అరుపుకి తుళ్ళిపడి నిద్ర కళ్ళతో "ఏవయిందండీ!" బావిలోకి అంది.

"చూదే! చంపేస్తానని బెదిరించినందుకు అది చావాలనుకుని బావిలోకి దూకబోతుందే!"

తండ్రి మాటలకు కలవరపడిన తాయారు తల్లి చెవిలో గుసగుసలాడింది.

ఒక్క పెట్టున పెద్దగా నవ్వుతూ "మీరు మరీనండీ... బావిలో ఎందుకు దూకుతుంది .. అదేఁవి చేసిందని . మీ కంగారుగాని. బావిలోకి దూకాలని కాదండీ బాత్‌రూముకి పోవాలనది పోతుంటే, ఏఁవిటండీ! ఇదంతా?" చివరకు మెగుడిపై మండిపడి కూతుర్ని లోనికు తీసుకుపోయింది.

ఖంగు తిన్నట్టు గుర్నాథం అక్కడే నిలబడి పోయాడు.

o o o

"నాన్నా! నేను బేట్ కొనుక్కోవాలని చెప్పి వారమయ్యింది. ఐవాంట్ మనీ!"—ఇది టెన్త్ చదువుతున్న పెద్ద కొడుకు కమాండ్ బజారుకు చేతసంచి పట్టుకుని వెళ్తున్న గుర్నాథం కొడుకు డబ్బు అడుగుతున్న తీరుకు ముఖం చిట్లించాడు.

"నాన్నగారూ! వచ్చేటప్పుడు ఎక్స్‌ర సైజు నోట్‌బుక్ తీసుకురండి"—ఇది మూడవ సంతానం అభ్యర్థన.

"నాన్నా! నాకు ఎర్రరిబ్బన్లు.. ." పదేళ్ళ అమ్మాయి కోరిక.

మరో క్షణం నిలబడుంటే మిగిలిన వాళ్ళు కూడ వాంటింగ్‌లతో చంపేస్తారని తనను కాదన్నట్టుగా పోతున్న గుర్నాథం చెవిలో "నాన్నా! వచ్చేటప్పుడు చింతకాయలు కొనుక్కురండి....నాకు తినాలనుంది"

"ఆఁ! ఏఁవిటి చింతకాయలాఁ?" గతుక్కు మన్నాడు.

"ఏఁ వన్నావే?. ఏం కావాలే?" అంటూ కూతురు దగ్గరకెళ్ళి "ఇప్పుడు చెప్పే! ఏఁవన్నావ్?" గట్టిగా అరిచాడు.

ఇదంతా కూ ర లు తరుగుతున్న మంగమ్మ చూసి "ఇప్పుడదేవన్నదండీ! అసలది నోరేనా కదిపిందా? టీసిమట్టు కూర్చునేదో కథల పుస్తకం చదువుకుంటుంటే...."ఏవన్నావ్? ఏవన్నావ్" అంటూ దానిమీద కెళ్ళారేం. మీకేమయినా మతిపోయిందా?"

"అదేఁవీ అనలేదా?"

"ఏఁవీ అనలేదు" ఖచ్చితంగా అంది.

"ఆఁ ఏఁవీ అనలేదా?" రెట్టిస్తూ అడిగాడు.

"ఏఁవనలేదంటున్నాగా... పోనీ.. అదేమందో చెప్పండి!"

"ఏవందా? బజారు నుండి వచ్చేటప్పుడు చింతకాయలు తీసుకురమ్మంది తినాలనుందట!" చెప్పబోయాడు, చెబితే మీరు .. మీకంగారంటూ ఫక్కున నవ్వుతుందని చెప్పలేక చల్లగా జారుకున్నాడు.

బజారు నుండి తిరిగి వస్తూ ఇంట్లో కడుగుపెట్టిన గుర్నాథందృష్టి తాయారు పై బడింది. విసురుగాపోయి కూతురి పై చేయి చేసుకున్నాడు—అంతే! తాయారు చెంపలు కం ది పో యా యి. దాంతో



"అమ్మో! నాన్న చంపేస్తున్నాడు" అంటూ శృతిచేసుకుని గొంతువిప్పి ఏడ్వ సాగింది. అదివిన్న మంగమ్మ వంటగది లోనుండి వస్తూ పరిస్థితిని గమనించి "ఏమిటండీ?" భర్తపై రెచ్చిపోయింది.

"చాలా బాగుందే! అసలు నువ్వేమైనా పట్టించుకుంటేగా! అదేమి తింటుందో చూడే... చూడు! మామిడికాయలు తింటుంది....నాకేదో అనుమానంగానే ఉందే .. నువ్వుకూడా ఇందులో ఏదో దాస్తున్నావే"

"ఆపండీ! మీమాటలు.. ." అంటూ కూతురి చేతిలో నుండి సగం తినగా మిగిలినది తీసుకుని భర్త కళ్ళముందరగా పెట్టి "చూడండీ! ఇదేమిటో... సరిగ్గా చూసి చెప్పండి! మామిడికాయో?... జాంకాయో?....చెప్పండీ!"

"ఆఁ జాంకాయా?!"

○ ○ ○

గుర్నాధానికి స్వతహాగా కంగారుంటే ఉండొచ్చుగానీ మరీ అంత మతి చెడిన మనిషి కాదు. అందుకే బాగా తల కొట్టుకొని మరీ ఆలోచిస్తున్నాడు. తనలో కంగార పెరిగినట్టే, ర్యానాను అమ్మాయి కడుపుకూడ గాలి కొడ్తున్న బెలూన్‌లా పెరిగిపెరిగి ముందుకు వస్తూంది. ఇందులో సందేహం లేదు. భార్యను నెమ్మదిగా ఆరా తీయాలని వంటగదిలోకి అడుగు పెడుతుండగా లోనుంచి మాటలు స్పష్టంగా చెవిని పడుతున్నాయి.

"అమ్మా! మరి దాచి లాభంలేదే! ఈ విషయం నాన్నకి చెప్పేస్తానమ్మా.. చంపేస్తే చంపనీ. ఈ నిజాన్ని దాచడానికి మనమిద్దరము ఇంకా ఈ నాటకం ఆడలేనమ్మా!"

"ఓ రెండురోజులు ఓపికపట్టవే! ఆ మోహన్‌తో అన్ని విషయాలు మాట్లాడాను. త్వరలో మీ నాన్నతో పెళ్ళి గురించి మాటాడతానని మాటిచ్చాడే!" అనునయిస్తూ అంది.

కూతుర్ని వెనకేసుకొనివచ్చి, ఇంత నాటకమాడుతూ కూతుర్ని సమర్థిస్తున్న భార్యపై మండిపడి, ప్రళయకాలరుద్రునిలా లోనికి జొరబడేసరికి "ఏమండీ! గుర్నాధంగారున్నారా ?"

బయటనుండి పిలుపు. వెళ్ళిచూస్తే ఎదురుగా... ఎదురింటి మోహన్. 'వెధవ.. ఎదురింటి వెధవ....ఎంత పన్చేశావురా' లోలోన తిట్టుకుంటున్నాడేగాని లోనికి రమ్మనమనలేదు.

మోహన్ పిలుపుకి తల్లీకూతుళ్లు గదిలోకి వచ్చి చూస్తున్నారేగాని లోనికి రమ్మనమనలే దెవ్వరూ.

తన్నెవరూ ఆహ్వానించకపోయినా పెదవులపై చిరునవ్వుతో లోనికివస్తూ "ఏదో జరిగిందేదో జరిగిపోయింది. మా తొందరపాటుకు క్షమించానంటే మీ అమ్మాయిని పెళ్ళి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాను" సవినయంగా అన్నాడు.

"నో! నీ కులమేవిటో... నువ్వేంటో మంచిచెడ్డలు తెలియకుండా....తగుదునంటూ పెళ్ళి చేసుకొనేందుకు పిల్ల నడగడానికొచ్చావా? సిగ్గులేదూ!" సీదరించుకున్నాడు.

మధ్యలో మంగమ్మ కలుగజేసుకొని భర్త చెవిలో నెమ్మదిగా "మీ తెలివి తేటలు....మీరూ....చాల బాగున్నాయి.... మీవద్ద ఈ విషయం దాచినందుకు క్షమించండి. అమ్మాయి గర్భవతి.... ఇప్పుడు క్షమించమని కోరి చేసుకుంటుంటే కాదంటారేవిటి? కులము... మంచిచెడ్డలంటూ వాదన కట్టిపెట్టండి. అబ్బాయి కెవరూ లేరు. ఏదో గవర్నమెంటు ఉద్యోగం చేసుకుంటున్నాడాయె! ఇంతకన్నా మనకేం కావాలి. పరిస్థితి చేయిదాటిపోయా కింకా చూస్తారేవిటండీ! ముందు మాటివ్వండీ సంతోషంగా" అంది.

కొంచెం దీర్ఘంగా ఆలోచించి, వెనుకాడితే ప్రమాదముందని చివరకు చేసేది లేక గంగిరెద్దులా తలూపి పెళ్ళికి అంగీకరించాడు.

ం ం ం

నెలరోజుల్లో అమ్మాయిని ఓ ఇంటి దాన్ని చేసి, అల్లుడితో అమ్మాయి తన ఇంటి కొచ్చేసరికి అన్ని ఏర్పాట్లు చేసాడు... ఊపిరి తీసుకున్నాడు నిశ్చింతగా.

ఆ రోజు మంచి విందివంటలతో చక్కని విందిచ్చాడు అల్లుడికి.

విందారగించాక పెరట్లో ఆరుబయట వెన్నెల్లో మంచాలు వేసుకొని పిల్లాజెల్లతో, పెళ్లాంతో ఆ ముచ్చట ఈ ముచ్చట మాటాడుతుండగా-ఒక్కసారి ఉధృతంగా ఉప్పెనొచ్చినట్లు-వాంతులు.. ఒకటే కక్కుకోవడం.

ఈసారి గుర్నాథం చిందులు తొక్కలేదు. ఎందుకంటే ఆ కక్కుకుంటున్నది అమ్మాయి కాదు... భార్య... ఊహు! భార్య అంతకన్నా కాదు. సాక్షాత్తు గుర్నాథమే కక్కుకుంటున్నాడు. పీకల మొయ్యా తిన్నదరక్క నీళ్లుబికిన కళ్ళతో అదేపనిగా కక్కుకుంటున్నాడు.

మునుపు అక్కయ్య కక్కుకోవడం ....అప్పుడు తండ్రన్నమాటలు మెదడులో రికార్డయిపోయిన చిట్టిగాడు ఇప్పుడు తండ్రి పరిస్థితిచూసి "అమ్మా! నాన్న మన కొంప ముంచాడే! పరువు గంగలో కలిపాడే!" అంటూ తండ్రి ధోరణిలో శోకాలు పెట్టేసరికి లోని గదిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తాయారూ, తాయారు మొగుడు ఇక ఒకటే నవ్వు.

తన్ను నవ్వుల పాల్జేసేందుకు భరించలేక టక్కున చిట్టిగాడి నోరు మూసేశాడు గుర్నాథం